
ప్రజా సంక్షేమమే సీఎం లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 48వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు

కంచరపాలెం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు రూపొందిస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 48వ వార్డు న్యూ శ్రీనివాసనగర్ పోలీస్ లేఅవుట్ తదితర సచివాలయాల పరిధిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి నీలి రవితో కలిసి ఆయన కొండవాలు ప్రాంతాల్లో పర్యటించారు. స్థానికులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ప్రజలందరూ ఆయనను దీవించి మళ్లీ గెలిపించాలని కోరారు. 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, సీనియర్ నాయకుడు కర్రి రమారెడ్డి, భూలోక, నాగేశ్వరరావు, సుగుణకుమార్, డొప్ప శ్రీను, భరత్, నరేష్, సాల్మన్‌రాజు, చౌదరి విష్ణు, ఆళ్ల శ్రీనివాసరావు, చిరంజీవి, అప్పారావు, బాబ్జీ, పి.చిన్నారావు, తిరుమలరావు, దమయంతి, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష



జీవీఎంసీ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సీతమ్మధార: భీమిలి నియోజకవర్గం మధురవాడ జోన్-2కు సంబంధించిన అభివృద్ధి పనులపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం సీతమ్మధారలోని ఆయన నివాసంలో జీవీఎంసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు విన్నవించుకున్న సమస్యలపై చర్చించారు. సీసీ రోడ్లు, విద్యుత్, డ్రైనేజీలు, తాగునీటి సమస్యలు లేకుండా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగో వార్డు మధురవాడకు ఏలేరు కాలువ నీరు అందించాలని, గోస్తనీ నది పైప్‌లైన్ పనులు మార్చి నాటికి పూర్తి చేయాలని, తుమ్మిగుడ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉండటం వల్ల స్టోరేజ్ వాటర్ ట్యాంకులా అభివృద్ధి చేద్దామంటే సమస్య పరిష్కరించలేకపోతున్నామని, అటవీ శాఖ అధికారులతో మాట్లాడి స్థానికులకు తాగునీరు అందించేలా చూడాలని ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా అభివృద్ధి చేయాలన్నారు. పార్కులు, రోడ్లు, వాటర్ ట్యాంక్‌లతోపాటు ఇతర అభివృద్ధి పనులు చకచకా జరగాలని ముత్తంశెట్టి సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ(నీటి సరఫరా) రవి, మధురవాడ జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, ఈఈలు, డీఈలు, ఏఈలు, ఇతర ఇంజినీరింగ్ అధికారులు, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అప్పన్నను దర్శించుకున్న సీపీడీసీఎల్ సీఎండీ



పద్మజనార్దనరెడ్డికి ప్రసాదం అందజేస్తున్న టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కనకరాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని బుధవారం ఏపీసీపీడీసీఎల్ సీఎండీ జె.పద్మజనార్దనరెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు చేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్ కనకరాజు అందజేశారు. సీఎండీ వెంట ఈఈ పి.శ్రీనివాసరావు, డీఈఈ ఆర్.రామునాయుడు, గోపాలపట్నం ఏఈ కుమార్ ఉన్నారు.

బౌద్ధాలయంలో ప్రత్యేక పూజలు



బాంతేజీని సత్కరిస్తున్న బౌద్ధ సమాజ సభ్యులు

కంచరపాలెం: అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయంలో ఆంధ్ర బౌద్ధ సమాజ కేంద్రం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మయన్మార్ నుంచి వచ్చిన బౌద్ధభిక్షువు సమసీరా ఘోషిత బాంతేజీ ముఖ్య అతిథిగా బుద్ధుడికి పూజలు చేసి, బౌద్ధ సూక్తులు వివరించారు. సనాతన ధర్మాన్ని పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా బాంతేజీని సమాజ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సిహెచ్.బాబురావు, సూర్యారావు, జి.బాబులు, గౌతమ్, భీమారావు, సునీల్ తదతరులు పాల్గొన్నారు.

శంకరమఠంలో అవహంతి హోమం



రుద్రాభిషేకం చేస్తున్న పండితులు

సీతంపేట: అనురాధ నక్షత్రం సందర్భంగా కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి ఆదేశాలతో బుధవారం స్థానిక శంకరమఠంలో అవహంతి హోమం నిర్వహించారు. పరమాచార్య దివ్యమంగళ మూర్తికి పంచామృతాభిషేకం, ఏక రుద్రాభిషేకం జరిపారు. కార్యక్రమంలో శంకరమఠం కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

టీడీపీలోనే కొనసాగుతా..

ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

మహారాణిపేట: తెలుగుదేశం పార్టీలో కొనసాగుతానని, వివిధ కారణాల వల్ల పార్టీకి ఇన్నాళ్లు దూరంగా ఉన్నానని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. బుధవారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ మరిన్ని విజయాలు సాధిస్తుందన్నారు. ఈనెల 27 నుంచి నారా లోకేష్ యువగళం పేరిట చేపట్టనున్న పాదయాత్ర హిట్ అవుతుందన్నారు.

22న ఫ్యాషన్ ర్యాంప్ వాక్

అల్లిపురం: ఈవెంట్ డైరెక్టర్ వీరుమామ ఆధ్వర్యంలో ఈ నెల 22న తేజ్ వివాన్ హోటల్లో డేజ్లింగ్ బ్యూటీస్ పేరిట ఫ్యాషన్ ర్యాంప్ వాక్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 45 మంది నుంచి 12 మందిని ఫైనల్ షోకు ఎంపిక చేశామన్నారు. వీరు వెస్ట్రన్ వేర్‌లో ర్యాంప్ వాక్‌లో పాల్గొంటారన్నారు. 2023లో విశాఖలో మొట్ట మొదటి ర్యాంప్ షో ఇది అని పేర్కొన్నారు. వీరుమామ ఆధ్వర్యంలో మోడల్ ర్యాంప్ వాక్ నిర్వహించారు.

మంచి చిత్రాలకు ప్రోత్సాహం



సినిమా బండి చిత్ర దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగులను సత్కరిస్తున్న అతిథులు

సీతంపేట: మంచి చిత్రాలను ప్రేక్షకులు ప్రోత్సహించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వంలో రూపొందిన సినిమా బండి చిత్ర ప్రదర్శన, అనంతరం దర్శకుడితో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అతిథులుగా హాజరైన పారిశ్రామిక వేత్త భరణికాన రామారావు, సీనియర్ నటుడు ఎస్కే మిశ్రో, వీజేఎఫ్ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, నండూరి రామకృష్ణ మాట్లాడుతూ లఘుచిత్ర దర్శకులకు ప్రస్తుతం అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. ఉత్సాహం, ఇష్టం, నిరీక్షణ ఉంటే దేనినైనా సాధించవచ్చని నిరూపించిన చిత్రం సినిమా బండి అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల మాట్లాడుతూ తను ఎక్కడా శిక్షణ తీసుకోలేదని, గతంలో లఘుచిత్రాలు నిర్మించానని, తన స్నేహితుల సహకారంతో రూపొందించిన సినిమా బండి చిత్రం గోవా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అవార్డు సాధించిందన్నారు. అతిథుల చేతుల మీదుగా ప్రవీణ్‌ను ఘనంగా సత్కరించారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి బి.చిన్నారావు, కార్యవర్గ సభ్యులు ఆర్.శివకుమార్, జి.బాబ్జి, రామచంద్ర ప్రభు, అంజు, పలువురు సినీ ప్రియులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో బ్రోచర్ ఆవిష్కరణ

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ విశాఖ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) భవనం వద్ద ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహించనున్న ఎంఎస్ఎంఈ ఎక్స్ పో-2023 బ్రోచర్‌ను వాసీవా ప్రతినిధులు, ఎంఎస్ఎంఈ అధికారులు, పారిశ్రామిక వేత్తలు బుధవారం ఆవిష్కరించారు. వాసీవా భవనంలో నిర్వహించిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కె.బాలాజీ మట్లాడుతూ ఎంఎస్ఎంఈ, వాసీవా సంయుక్తంగా ఈ ఎక్స్ పోను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎక్స్ పోలో 70 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు కార్యదర్శి డి.వినోద్ తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు, ఇంజినీరింగ్ విద్యార్థులకు, ఉపాధి రంగానికి ఎక్స్‌పో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎంఎస్ఎంఈ ఇన్‌చార్జి ఏడీ జి.వి.ఆర్.నాయుడు అన్నారు. కార్యక్రమంలో వాసీవా ఉపాధ్యక్షుడు ఇ.కృష్ణ ప్రసాద్, కోశాధికారి బి.ఎస్.రావు, ఐలా మాజీ చైర్మన్ వై.సాంబశివరావు, పారిశ్రామిక వేత్తలు పాండురంగ ప్రసాద్, కోటేశ్వరరావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్‌కు ఆహ్వానం

స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్(కమర్షియల్) కె.మహంతిని ప్రతినిధులు ఎక్స్‌పోకు ఆహ్వానించారు. వాసీవా అధ్యక్షుడు ఎ.కె.బాలాజీ, ఎంఎస్ఎంఈ ఇన్‌చార్జి డైరెక్టర్ జి.వి.ఆర్.నాయుడు, ఐలా ప్రధాన కార్యదర్శి చీకటి సత్యనారాయణ బుధవారం ఆయన చాంబర్‌లో కలిసి ఆహ్వానం పలికారు.

విలక్షణ గ్రంథం విజయ విలాసం



మాట్లాడుతున్న సాహితీ విమర్శకుడు సుబ్బారావు

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో 'చేమకూర వెంకట కవి-కవితా చమత్కృతి' అనే అంశంపై సాహిత్య ప్రసంగ కార్యక్రమం జరిగింది. ముఖ్య వక్త, కవి, విమర్శకుడు ఎం.సుబ్బారావు మాట్లాడుతూ తంజావూరు నాయక రాజుల్లో ముఖ్యుడు రఘునాథ నాయకుడి ఆస్థాన కవి చేమకూర వెంకటకవి అని అన్నారు. ఆయన రాసిన సారంగధర చరిత్ర, విజయ విలాసం అద్భుతమైన కావ్యాలని పేర్కొన్నారు. విజయ విలాసం విజయుడగు అర్జునుడు, ఉలూచి, చిత్రాంగద, సుభద్రల వివాహం సరస శృంగార వర్ణనలతో శ్లేష ఉపయోగించి తెలుగు సాహిత్యానికి అలంకారమనదగిన గ్రంథాన్ని అందించారని కొనియాడారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ 17వ శతాబ్దానికి చెందిన చేమకూర వెంకటకవి రచించిన విజయ విలాసం ఒక విలక్షణమైన గ్రంథమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కవులు, రచయిలు డి.వి.సూర్యారావు, కె.జి.వేణు, కుప్పిలి భీమేశ్వరరావు, కొత్తూరి రమణ, పి.వి.ఆర్.కె.రావు, భాగవతుల సత్యనారాయణ, రామతాత, కె.వి.ఎస్.మూర్తి, గండికోట విశ్వనాథం, పి.ఎల్.వి.ప్రసాద్ ప్రసంగించారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



పాలబూత్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బొడ్డేటి మోహన్ తదితరులు

సీతంపేట: మాజీ ముఖ్యమంత్రి, సినీ దిగ్గజం నందమూరి తారక రామారావు 27వ వర్ధంతి కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. అక్కయ్యపాలెం పాలబూత్ సెంటర్ సాయిబాబా మందిరం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ 43వ వార్డు అధ్యక్షుడు బొడ్డేటి మోహన్ మాట్లాడుతూ తెలుగు వారి గొప్పతనాన్ని యావత్ ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సరిసా ప్రసాద్, కాళ్ల శ్రీను, మాదేటి శ్రీను, రాజగిరి కన్నబాబు, కాండ్రేగుల సన్యాసిరావు, బొడ్డేటి కన్నారావు పాల్గొన్నారు.

పండ్లు, చీరల పంపిణీ

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం యల్లబిల్లివారి వీధిలోని టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఆ పార్టీ రాష్ట్ర తెలుగు మహిళ అధికార ప్రతినిధి డాక్టర్ ఈతలపాక సుజాత పూలమాల వేసి నివాళి అర్పించారు. వృద్ధులు, మహిళలకు పండ్లు, చీరలు పంపిణీ చేశారు. వార్డు నాయకులు గంట్యాడ వీరుబాబు, ఇ.ఈశ్వరరావు, కె.కోటి, ఎం.తాతారావు, ఎం.దేవి, డి.వరలక్ష్మి, పి.యమున, ఎం.ఈశ్వరమ్మ, సిహెచ్.వీరన్న, కనకమ్మ పాల్గొన్నారు.

50వ వార్డులో..

మురళీనగర్: జీవీఎంసీ 50వ వార్డు టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ పార్లమెంటరీ అధికార ప్రతినిధి సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి బిర్లా కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. వృద్ధులకు పండ్లు పంచారు. టీడీపీ 53వ వార్డు అధ్యక్షుడు పొలమరశెట్టి శ్రీను, మూల అప్పారావు, సనపల రామచంద్రరావు, కనమటి రమణ, పేడాడ మధు, ఎన్‌టీఎస్ కుమార్, తెలుగు యువత అధ్యక్షుడు బొండల మదన్‌మోహన్, మహిళా విభాగం అధ్యక్షురాలు పైడి పుణ్యవతి, ప్రమీల రాణి, దవళకుమారి, అజయ్, నాగన్న, సనపల విజయ్‌కుమార్, కంచరాణ వరదరాజు, నంబాళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా బోధన



అధ్యాపకులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: అధ్యాపకులు 21వ దశాబ్దపు నైపుణ్యాలు, బోధన పద్ధతులపై విస్తృత అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ సూచించారు. ఏయూ హెచ్‌ఆర్‌డీసీ కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి, కామన్వెల్త్ ఎడ్యుకేషనల్ మీడియా సెంటర్ ఫర్ ఏషియా, ఏయూ సంయుక్తంగా బుధవారం నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రొగ్రాంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అధ్యాపకులు నిరంతరం తమ బోధన పద్ధతులను మెరుగుపరచుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. నూతన విద్యా విధానంలో వచ్చిన మార్పులను అవగాహన చేసుకుంటూ విద్యార్థులను తీర్చిదిద్దడం లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాలను యువతలో పెంపొందించడం ఎంతో అవసరమని చెప్పారు. విలువైన మానవ వనరులుగా యువతను తీర్చిదిద్ది అందించాల్సిన అవసరం ఉందన్నారు. మాస్టర్ ట్రైనర్ దినకర్‌రెడ్డి, విశిష్ట అతిథి హెచ్‌ఆర్‌డీసీ సెంటర్ సంచాలకుడు ఆచార్య టి.వి కృష్ణ, కార్యక్రమ సమన్వయకర్త ఆచార్య ఎన్.ఎ.డి.పాల్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లోని వివిధ కళాశాలలకు చెందిన 55 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

'ప్రజాగర్జన'తో కేంద్రానికి గుణపాఠం

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 30న నిర్వహించ తలపెట్టిన ఉక్కు ప్రజాగర్జనతో కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ, కన్వీనర్ జె.అయోధ్యరామ్ అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 706వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో పలువురు ఎంఎంఎస్ఎం, ఎస్‌టీఎం విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని దేశ ప్రజలు, కార్మికవర్గం.. మరీ ముఖ్యంగా సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు గట్టి పట్టుదలతో ఉన్నారన్నారు. కనుక కేంద్ర ప్రభుత్వం పదేపదే చేసే ప్రకటనలతో బెదిరేది లేదన్నారు. అన్ని రాజకీయ పక్షాలతో కలిపి ఈ నెల 30న ఉక్కు నగరంలోని త్రిష్ణ మైదానంలో సాయంత్రం 4 గంటలకు భారీ ఎత్తున ప్రజాగర్జన నిర్వహించనున్నామని, కార్యక్రమానికి రాష్ట్ర, జాతీయ రాజకీయ నేతలను ఆహ్వానిస్తున్నామని తెలియజేశారు. ఉక్కు కార్మికులు, గాజువాక ప్రజానీకం తమ కుటుంబాలతో కలిసి హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డి.దేముడు, జి.ఆనంద్, డి.రమేష్, ఎం.కె.వి.రాజేశ్వరరావు, మోహన్‌కుమార్, ఆర్.సూరిబాబు, ఎస్.వి.నారాయణ, మహ్మద్, పెదిరెడ్ల దేముడు, రమణ, దాసరి శ్రీనివాస్, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా పోలమాంబ పరస



పూజలందుకున్న పోలమాంబ అమ్మవారు



సీతారాముల విగ్రహాలను ఊరేగిస్తున్న ఉత్సవ నిర్వాహకులు, భక్తులు

ఏయూక్యాంపస్: శ్రీ కరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక పరస మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. నగరంలోని 14 గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు సమర్పించారు. పెదవాల్తేరు గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీరామ పట్టాభిషేకం, భజనచెట్టును భక్తజన సందోహం ఊరేగింపుగా తీసుకువచ్చారు. పెదవాల్తేరు నుంచి పోలమాంబ ఆలయానికి వీటిని స్థానికులు ఊరేగింపుగా తోడ్కొని వచ్చారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భజన బృందాలు, కోలాటం, తప్పెట గుళ్లు, గరిడీలు అమ్మవారి ఆలయం వద్ద పండగ వాతావరణాన్ని తీసుకొచ్చాయి. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పోలమాంబను దర్శించుకున్నారు. పంచామృతాభిషేకాలతో వేడుకలను ప్రారంభించారు. అనంతరం మండపంలో ప్రత్యేక కుంకుమ పూజలు జరిపారు. మూడు రోజుల సంక్రాంతి పండగకు కొనసాగింపు అన్నట్లుగా పోలమాంబ పరస మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ ప్రాంగణాన్ని పూల మాలలు, విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. పరస సందర్భంగా దేవాలయం నుంచి పెదవాల్తేరుకు వెళ్లే మార్గంలో ఇరువైపులా చెరకుగడలు, చిన్నారుల ఆటవస్తువులు, వివిధ గృహాలంకరణ వస్తువులను చిరు వ్యాపారులు విక్రయించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి డి.వి.ఎస్.సురేష్‌బాబా, ఆలయ చైర్మన్ పి.శంకర రెడ్డి, ధర్మకర్తలు మాదు మంగరాజు, నీలాపు నైటమ్మ, నండూరి కృష్ణమోహన్, గొంప సంతోష్‌కుమార్, మరడ నాగమణి, మారేడ్ల సత్య వెంకట రమణమ్మ, బిడుమూరి భారతి, శ్రీనివాస ఆచార్యులు, 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మీసురేష్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ సేవా సంఘం పెద్దలు, 14 గ్రామాల పెద్దలు పాల్గొని అమ్మవారిపై తమ భక్తిప్రపత్తులను చాటుకున్నారు.

నిబంధనలు పాటించాల్సిందే

అల్లిపురం: లాడ్జీల యాజమాన్యాలు నిబంధనలు పాటించాల్సిందేనని నగర క్రైం డీసీపీ నాగన్న తెలిపారు. పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఆదేశాల మేరకు లాడ్జీలు, హోటల్ యజమానులతో ఆయన బుధవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తప్పనిసరిగా సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంచాలన్నారు. లాడ్జిలు, హోటళ్ల లోపల, బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, సీసీ ఫుటేజీ నిల్వ సామర్థ్యం పెంచాలని కోరారు. హోటల్‌కు వచ్చే వారి వివరాలు విజిటర్స్ మానిటరింగ్ సిస్టమ్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. వివరాలు, హోటల్లో దిగిన వారి ఆధారాలు సమగ్రంగా పొందుపరచాలన్నారు. ఏసీపీ శ్రావణ్‌కుమార్, ఈస్ట్ సబ్ డివిజన్ క్రైం సీఐ యర్రంనాయుడు, టూటౌన్ క్రైం ఎస్ఐ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్రాంతికి ఊరెళ్తే.. ఇంటిని దోచేశారు..!



డ్రైవర్స్ కాలనీలోని బాధితుడి ఇంట్లో చిందరవందరగా పడేసిన బీరువాలో వస్తువులు

ఆరిలోవ: ఆరిలోవలో ఓ కుటుంబం సంక్రాంతి పండక్కి సొంతూరు వెళ్లి తిరిగొచ్చే సరికి దొంగలు వారింటిని దోచేశారు. ఆరిలోవ క్రైం ఎస్ఐ రుక్మంగధరరావు తెలిపిన వివరాలిలా.. డ్రైవర్స్ కాలనీ శివాలయం ఎదురుగా గోపిశెట్టి వెంకటరమణ కుటుంబంతో నివాసముంటున్నాడు. సంక్రాంతి పండగ జరుపుకోవడానికి కుటుంబ సభ్యులను తీసుకుని ఈ నెల 13న సొంతూరు రాజాం వెళ్లారు. ఈ నెల 16న ఆయన బంధువు ఆ ఇంటివైపు వెళ్లి చూసేసరికి తాళం తెరిచి ఉంది. లోపల వస్తువులు వేర్వేరు చోట పడేసి ఉన్నాయి. దీన్ని గమనించిన ఆ వ్యక్తి వెంకటరమణకు ఫోన్ చేసి ఇంట్లో దొంగలుపడి ఉంటారని సమాచారం అందించాడు. దీంతో వెంకటరమణ, అతడి భార్య మంగళవారం రాత్రి ఆరిలోవ చేరుకున్నారు. ఇంట్లో బీరువాలోని దుస్తులు కిందన చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో దాచిపెట్టిన బంగారు వస్తువులు కనిపించలేదు. దీంతో ఇంట్లో దొంగలు పడ్డారని గ్రహించి ఆరిలోవ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ రుక్మంగధరావు, సిబ్బందితో వెళ్లి దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించారు. బీరువాలో ఉన్న మూడు తులాల బంగారు ఆభరణాలు దొంగలు పట్టుకుపోయినట్లు ఎస్ఐ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులకు వేసిన తాళాలు పగలుగొట్టి లోపలకు ప్రవేశించినట్లు చెప్పారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు


సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఘనంగా విష్ణు సహస్రనామ పారాయణ

ఏకాదశిని పురస్కరించుకుని సింహగిరిపై వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సామూహిక విష్ణుసహస్రనామ పారాయణ బుధవారం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో అర్చకులు, వేద పండితులు స్వామికి పూజలు చేసి హారతులు అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

పబ్లిక్ డిమాండ్

అంధకారంతో అవస్థలు



తోట వీధిలో లైట్ వెలగని స్తంభం

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి తోటవీధికి వెళ్లే రహదారిలో అంధకారం అలుముకుంది. విద్యుత్ స్తంభాలకు లైట్లు లేకపోవడంతో చీకట్లో ప్రయాణం చేయాల్సి వస్తోంది. స్పందన కార్యక్రమంలో వినతులు అందించినా అధికారులు స్పందించడం లేదు. ఆకతాయిల ఆగడాలు శృతిమించుతున్నాయి. ద్విచక్ర వాహనాల నుంచి పెట్రోలు తీసేస్తున్నారు. చిల్లర దొంగతనాలు పెరిగాయి. సంబంధిత అధికారులు స్పందించి స్తంభాలకు లైట్లు అమర్చాలి.

– యలమంచలి రాజు, తోట వీధి, కంచరపాలెం

సిమెంటు దిమ్మె వేయండి



గొల్లకంచరపాలెంలో ప్రమాదకరంగా కాలువ మలుపు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గొల్ల కంచరపాలెం, దుర్గానగర్ ప్రాంతాల్లో కాలువలపై సిమెంటు దిమ్మెలు లేకపోవడంతో ద్విచక్రవాహనాలు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్నిచోట్ల దిమ్మెలు శిథిలావస్థకు చేరి ప్రమాదభరితంగా మారాయి. అధికారులు స్పందించి సిమెంటు దిమ్మెలు వేయాలి.

– బొట్టా కొండలరావు, గొల్లకంచరపాలెం